క్లుప్తంగా

అభివృద్ధికి అండగా నిలవండి



అభివృద్ధికి అండగా ఉండాలని యువతను కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి సిటీ : తిరుపతి రూపురేఖలు మార్చి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి యువత అండగా నిలబడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సీకాం కళాశాలలో కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థులతో వారు సమావేశమయ్యారు. గత 70 ఏళ్లుగా నగరాన్ని పట్టించుకున్న నాథుడే లేడని, యువనాయకుడు భూమన అభినయ్‌రెడ్డి కేవలం 2 ఏళ్లలో అభివృద్ధి ఏమిటో చేసి చూపించారన్నారు. యువత కోసం త్వరలో తిరుపతిలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. యువత అభినయ్‌రెడ్డికి ఓటు వేసి అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి సురేష్, అనిల్‌రెడ్డి, మన్నం ప్రేమ్‌కుమార్, బండి నాగరాజు ముని, నరేష్, నాగేంద్ర, ప్రశాంత్, పవన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో ఆధునిక టెక్నాలజీ పాత్ర కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సిద్ధు, హాజరైన విద్యార్థులు

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ రంగంలో ఆధునిక టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందని, విద్యార్థులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కెనడాకు చెందిన అంటారియాటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ తర్లోచన్ సిద్ధూ సూచించారు. సోమవారం స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ-పలు రంగాల్లో ఆవిష్కరణ ధోరణలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదుస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ త్రీడీ ప్రింటింగ్, బిగ్ డేటా, ఎనర్జీ స్టోరేజ్, అగ్మెంటెడ్ రియాలిటీ, డిజిటల్ టెక్నాలజీ, జనరేటివ్ డిజైన్, రోబోటిక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో ప్రిన్సిపల్ నాథముని రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవం వేడుకలు

తిరుపతి కల్చరల్: రాస్ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పద్మభూషణ్ గ్రహీత, భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరవుతారని తెలిపారు. అలాగే ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్, అతిథులుగా ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ మేడసాని మోహన్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాస్ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది, రాస్ జనరల్ బాడీ, కార్యనిర్వాహక సభ్యులు హాజరవుతారని తెలిపారు.

కళాకారుడు శరత్‌చంద్రకు నేపాల్ ఆహ్వానం



కళాకారుడు శరత్ చంద్ర

తిరుపతి కల్చరల్: మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 6, 7, 8 తేదీల్లో నేపాల్‌లోని ఖట్మండు నగరంలో పశుపతినాథ్ ఆలయంలో జరిగే శివరాత్రి ఉత్సవాలలో భరతనాట్య ప్రదర్శనకు తిరుపతికి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారుడు డాక్టర్ పి.శరత్‌చంద్రకు ఆహ్వానం లభించింది. ఈమేరకు ఈ నెల 6వ తేదీ ఢిల్లీ నుంచి ఖట్మండుకు శరత్‌చంద్ర బయలుదేరి వెళ్లనున్నారు. దేశ, విదేశాల్లో భారతీయ కళలను ప్రదర్శిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయ ప్రాచీన కళలను, వాటి విశిష్టతను ప్రపంచ దేశాలకు తెలియజేసే అవకాశం రావడం తన పూర్వ జన్మ సుకృతమని కళాకారుడు శరత్‌చంద్ర తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పశుపతి క్షేత్ర వికాస్ కోష్, పశుపతి డెవలప్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి గుడిమల్లం బ్రహ్మోత్సవాలు

ఏర్పేడు: మండలంలోని పురాతన గుడిమల్లం శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు భక్తుల కోసం ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి విస్తృత ఏర్పాట్లు చేశారు.

శేష వాహనంపై శ్రీకపిలవిభుడి తేజసం



శేష వాహనంపై దర్శనమిస్తున్న కపిలేశ్వరస్వామి



మకర వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి శేష వాహనాన్ని అధిరోహించి శ్రీకామాక్షి అమ్మవారు సమేత శ్రీకపిలేశ్వరస్వామి తేజోవిలాసంగా ఊరేగుతూ భక్తులకు దర్శమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి శేష వాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామివారి శేష వాహన సేవ కోలాహలంగా జరిగింది. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి మకర వాహన సేవ వేడుకగా జరిగింది. శ్రీసోమస్కంధమూర్తిగా శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా మకరవాహనంపై కొలువై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి పురవీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలోని మండపంలో అర్చకులు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. కాగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి అధికార నంది వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి వాహన సేవ ముందు కోలాటం, భజనలు చేస్తున్న కళాకారులు

ప్రతిపేద విద్యార్థి భవితకు జగనన్న భరోసా



జీవకోన హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పేద విద్యార్థి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ వారికి భరోసా కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి జీవకోనలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం జీవలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం నాడు-నేడు కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని ప్రయత్నిస్తే, వాటిని అద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. తిరుపతి నగరంలోని ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పది పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటేశ్వరమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ సురేంద్రరెడ్డి, హెచ్‌ఎం సంధ్య, నాయకులు రాజేంద్ర, కోటి, వెంకటేష్, మహేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌తో పలువురు భేటీ



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కలిసిన కృపాలక్ష్మి



టీటీడీ చైర్మన్ భూమనను సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ అర్చకులు

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛంతో కరుణాకరరెడ్డిని ఆమె సత్కరించారు. అనంతరం కృపాలక్ష్మికి ఆయన దుశ్శాలువ కప్పి అభినందించారు.

శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఉత్సవాలకు ఆహ్వానం..

సురుటుపల్లి శ్రీసర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని ఆలయ అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. అనంతరం ఆలయ అర్చకులు కరుణాకరరెడ్డికి దుశ్శాలువ కప్పి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

భూమనతో పార్టీ న్యాయ విభాగ నూతన కమిటీ..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ నూతన కమిటీ సభ్యులు సోమవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కమిటీ నాయకులు బి.నరహరి రెడ్డి, కె. విజయభాస్కర్‌రెడ్డి వారికి దుశ్శాలువలు కప్పి రానున్న ఎన్నికల్లో అభినయ్‌రెడ్డి విజయానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు దొరబాబు, మోహన్‌కుమార్, విజయ కుమార్, మధుసూదన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ చైర్మన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ నూతన కమిటీ నాయకులు

త్వరగా గుర్తిస్తేనే పరిష్కారం



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

తిరుపతి కల్చరల్: వినికిడి సమస్యను త్వరగా గుర్తించి సరైన వైద్య సలహాలు, చికిత్స ద్వారా పరిష్కరించుకోవచ్చని అడియాలజిస్టు డాక్టర్ పి.గోపినాథ్ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో సోమవారం వినికిడిపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వినికిడి చాల ముఖ్యమని, ఆ సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక శబ్దాలు వినడం, శబ్దకాలుష్యం, ఎక్కువ సమయం మొబైల్‌ఫోన్లలో మాట్లాడడం వంటి వాటి కారణంగా వినికిడి సమస్య రావచ్చని తెలిపారు. పుట్టిన పిల్లల్లో వినికిడి లోపం ఉంటే మాటలు రావన్నారు. దీన్ని ముందస్తుగా గుర్తించి వైద్యుల సలహాల ద్వారా డిజిటల్ ప్రోగ్రామబుల్ హియరింగ్ ఎయిడ్స్ ద్వారా, కాక్లియార్ ఇంప్లాంటేషన్ వంటి సర్జరీల ద్వారా వినికిడిని తిరిగి పొందవచ్చని తెలిపారు. మంగళవారం కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సెంటర్‌లో ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9849085342ను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్ణాటక సత్రంలో వాస్తుహోమం



వాస్తుహోమంలో పాల్గొన్న కర్ణాటక రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి

తిరుమల : తిరుమలలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన అతిథిగృహాల భవన సముదాయంలో సోమవారం వాస్తు హోమం నిర్వహించారు. ఉదయం కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి వాస్తుహోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. దాదాపు రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవన సముదాయాన్ని త్వరలోనే ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రస్తుతం వాస్తుహోమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజేంద్రకుమార్ కటారియా, దేవదాయశాఖ కమిషనర్ హెచ్.బసవరాజేంద్ర, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు అనంత తదితరులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ : మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నంబర్లపై శ్రీపద్మావతీ బాలికోన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధ్యయన కేంద్రం అసోసియేట్ డాక్టర్ కోన ప్రభ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, హత్యలు పెరిగిపోతూ ఉండడం బాధాకరమని తెలిపారు. మహిళా రక్షణకు ఉన్న టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ యాప్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. బాలికలు, మహిళలు అకస్మాత్తుగా ఇబ్బందుల్లో పడినా, ప్రమాదంలో ఉన్నామని భావించినా, వెంటనే 100, 112, 181, 139 వంటి టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా, అలాగే ఏపీ పోలీస్ సేవా, దిశా వంటి యాప్‌లను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయునులు, అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఇంద్రాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యం



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

- కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: ప్రజల నుండి వచ్చే సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యంగా ఉండాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో కమిషనర్ అదితిసింగ్ పాల్గొన్నారు. స్పందనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. టౌన్ క్లబ్ ఫ్రీ సర్కిల్ కోసం, హీరో షోరూమ్‌కు తూర్పు వైపు నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు స్థలాలు ఇచ్చిన యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా తిరుపతిలో అనాథ శవాల దహనక్రియలు నిర్వహించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ తరఫున వాహనాన్ని ఏర్పాటు చేయాలని కమిషనర్‌కి విన్నవించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 11, స్పందనకు 22 సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. శానిటేషన్, యూడీఎస్ మ్యాన్ హోల్ ఓవర్ ఫ్లో, అభివృద్ధి పనులు పూర్తయిన చోట ప్యాచ్ వర్క్ చేపట్టాలని అనేక ఫిర్యాదులు అందాయి. అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష‌రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ చిట్టిబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించండి



ఎన్నికల విధులపై సూచనలు ఇస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికలు 2024 విధులను కేటాయించిన నోడల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల విధులకు కావలసిన సిబ్బందిని కేటాయించేలా ఏర్పాట్లు మ్యాన్ పవర్, ట్రైనింగ్, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, లా అండ్ ఆర్డర్, ఈవీఎం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్స్, ఓటరు హెల్ప్ లైన్, అబ్జర్వర్స్ తదితర విభాగాల్లో నోడల్ ఆఫీసర్లుగా కేటాయించిన అధికారులంతా విధులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని వివరించారు. సమావేశంలో ఎన్నికల విధులు కేటాయించిన వివిధ నోడల్ ఆఫీసర్లు, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీటీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



స్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తిరుపతి తుడా: తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్‌లో 1976 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కోరిక మేరకు ఒక బీరువా, ఫుట్ బాల్, వాలీబాల్ వంటి క్రీడా సామగ్రిని స్కూల్ హెడ్ మాస్టర్ మునిశేఖర్‌కు అందజేశారు. అంతేకాక 100 మందికి పైగా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను సంఘం తరపున పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు భార్గవ, విజయఫణిబాబు, మోహన్, సోము, రవి తదితరులు మాట్లాడుతూ 2014లో ఏర్పడిన తమ సంఘం 10వ వార్షికోత్సవాల్లో భాగంగా తాము చదువుకున్న పాఠశాలపై ప్రేమతో మూడోసారి చేతనైన సహాయం అందిస్తున్నామని తెలిపారు.

అంకాలజీలో బ్రాకీ థెరపీ



డాక్టర్ డీఎస్ శర్మను గోల్డ్ మెడల్‌తో సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: క్యాన్సర్ చికిత్సలో బ్రాకీ థెరపీ విధానం రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని న్యూఢిల్లీ ఎయిమ్స్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ డీఎస్ శర్మ పేర్కొన్నారు స్విమ్స్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆరో వార్షిక చైర్ ఓరియేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డీఎస్ శర్మ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. క్యాన్సర్ కణితిపై నేరుగా రేడియోధార్మిక పదార్థాన్ని ఉపయోగించేందుకు బ్రాకీ థెరపీ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఓరియేషన్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆధునిక పద్ధతులను వైద్య విద్యార్థులకు అందించాలన్న సంకల్పంతో తరచూ ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అపర్ణ ఆర్ బిట్ల, డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ బీవీ సుబ్రమణియన్, డాక్టర్ ప్రాణబంధు దాస్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీఓంకార జ్యోతిర్లింగస్వామి ఆలయ కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట మండలం వెదర్లచెరువు గ్రామంలో వెలిసిన శ్రీఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 8, 9వ తేదీల్లో జరుగనున్న శివరాత్రి మహోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ స్వామి, గుండాల గోపినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కపిలతీర్థం నంది సర్కిల్లో ఆలయ కమిటీ సభ్యులు శివరాత్రి మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8న శివరాత్రి నాడు ఉదయం 6 గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇదే రోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం ఉంటుందన్నారు. 9న ఉదయం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి మహోత్సవాలకు భక్తులంతా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్ స్వామి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రభాకర్ నాయుడు, కేఎస్ రాజా, పొన్నాల జేజిరెడ్డి పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల

పుత్తూరు: వడమాలపేట మండలంలోని సదాశివకోనలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్లను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా విడుదల చేశారు. సోమవారం నగరి మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సదాశివ కోనలో వెలసిన శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మహా శివరాత్రికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



మహా శివరాత్రి పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి రోజా

క్లుప్తంగా

శేషవాహనంపై శ్రీఅగస్త్యేశ్వర స్వామి



శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీఅగస్త్యేశ్వర స్వామి, అమ్మవారు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్లు శేష వాహనంపై ఆసీనులై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి మరోమారు భూత వాహనంపై ఆసీనులైన పార్వతీపరమేశ్వరులు భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సినీనటి సమంత



అమ్మవారిని దర్శించుకున్న నటి సమంత

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీనటి సమంత సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ వెలుపలకు వచ్చిన సమంతను చూసి సెల్ఫీలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు.

అంకాలజీలో బ్రాకీ థెరపీ



డాక్టర్ డీఎన్ శర్మను గోల్డ్ మెడల్‌తో సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: క్యాన్సర్ చికిత్సలో బ్రాకీ థెరపీ విధానం రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని న్యూఢిల్లీ ఎయిమ్స్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ డీఎన్ శర్మ పేర్కొన్నారు స్విమ్స్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆరో వార్షిక చైర్ ఓరియేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ డీఎన్ శర్మ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు. క్యాన్సర్ కణితిపై నేరుగా రేడియోధార్మిక పదార్థాన్ని ఉపయోగించేందుకు బ్రాకీ థెరపీ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఓరియేషన్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆధునిక పద్ధతులను వైద్య విద్యార్థులకు అందించాలన్న సంకల్పంతో తరచూ ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అల్లాడి మోహన్, డాక్టర్ అపర్ణ ఆర్ బిట్ల, డాక్టర్ ఉషా కళావత్, డాక్టర్ బీవీ సుబ్రమణియన్, డాక్టర్ ప్రాణబంధు దాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు శరత్‌చంద్రకు నేపాల్ ఆహ్వానం



శరత్ చంద్ర

తిరుపతి కల్చరల్: మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 6, 7, 8 తేదీల్లో నేపాల్‌లోని ఖాట్మండు నగరంలో పశుపతినాథ్ ఆలయంలో జరిగే శివరాత్రి ఉత్సవాలలో భరతనాట్య ప్రదర్శనకు తిరుపతికి చెందిన ప్రముఖ భరత నాట్య కళాకారుడు డాక్టర్ పి.శరత్‌చంద్రకు ఆహ్వానం లభించింది. ఈమేరకు ఈ నెల 6వ తేదీ ఢిల్లీ నుంచి కట్మండుకు శరత్‌చంద్ర బయలుదేరి వెళ్లనున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను, వాటి విశిష్టతను ప్రపంచ దేశాలకు తెలియజేసే అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతమని తెలిపారు.

ఆత్మీయత పంచుతూ...
యోగక్షేమాలు తెలుసుకుంటూ..

- జనంతో మమేకమైన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ఆధ్యాత్మిక పాదయాత్రలో పెద్దల ఆలింగనం



ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఆప్యాయంగా అలింగనం చేసుకుంటున్న వృద్ధుడు



చెర్లోపల్లి రికార్డు సర్పంచ్ విప్పర్ల రెడ్డెప్పనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, పక్కన వాసుదేవనాయుడు

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నిహితుడిగా.. రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో కీలక నేతగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నిత్యం బిజీగా ఉండే ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం నియోజకవర్గ నేతలతో సందడి చేశారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీనివాస మంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు చేపట్టిన ఆధ్యాత్మిక పాదయాత్రలో పాల్గొన్న చెవిరెడ్డి ఆయా గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు. వారికి ఆత్మీయతను పంచుతూ, యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, వారి అవసరాలను తీరుస్తూ ముందుకు సాగారు. నాయకులను, పార్టీ శ్రేణులను పేరు పేరున పలకరించారు. పలువురు పెద్దలు చెవిరెడ్డిని చూడగానే ఆనందంతో ఆలింగనం చేసుకుని ఆశీస్సులు అందించారు. పలు చోట్ల యువకులు, మహిళలు, చిన్నారులు సెల్ఫీలు తీసుకుని, తమ గ్రామాల అభివృద్ధికి ఆయన అందించిన తోడ్పాటుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మోహిత్‌రెడ్డిని తప్పకుండా ఆదరిస్తామన్నారు. ప్రతి గ్రామంలో జనం తనపై చూపిన అభిమానం, ఆయన వెంట నడిచి వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చెర్లోపల్లి రికార్డు సర్పంచ్‌కు పరామర్శ

తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి చెర్లోపల్లి పంచాయతీకి 33 ఏళ్ల పాటు సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించి రికార్డు సృష్టించిన విప్పర్ల రెడ్డెప్పనాయుడును ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. 'భాస్కర్... ముఖ్యమంత్రి జగన్ నిన్ను ఒంగోలు ఎంపీగా పోటీలో నిలబెట్టాడు అంటగా...అక్కడ ఎంపీగా నువ్వు, ఇక్కడ ఎమ్మెల్యే మోహిత్ తప్పకుండా గెలుస్తారు' అంటూ 98 ఏళ్ల రెడ్డెప్పనాయుడు ఆశీర్వదించారు. నీకు ఓటు వేసి గెలిపించిన ఈ చేతులతో నీ బిడ్డకు కూడా ఓటు వేయాలని తపిస్తున్నట్లు ఆ పెద్దాయన చెప్పడంతో... మీ ఆశీస్సులు అంటూ ఆయనకు నమస్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు విప్పర్ల వాసుదేవనాయుడు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక శోభాయాత్రలో ఎమ్మెల్యే చెవిరెడ్డికి మంగళ హారతులు పడుతున్న మహిళలు



అన్నప్రసాదాల పంపిణీ



శోభాయాత్ర ముందు కోలాటాల ప్రదర్శన



తుమ్మలగుంట నుంచి శ్రీనివాసమంగాపురానికి బయల్దేరిన ఆధ్యాత్మిక శోభాయాత్ర



కళాకారుల ప్రదర్శన

సంతాన ప్రదాత తలకోన శ్రీసిద్ధేశ్వరుడు

సంతాన ప్రదాతగా, కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి కొలుస్తారు. దక్షిణ కైలాసంగా తలకోనను పిలుస్తారు. మహా శివరాత్రి పర్వదినాన జరిగే సిద్ధపూజకు చాలా పవిత్రమైన ప్రత్యేకత ఉంది. సిద్ధపూజకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తారు.

- నేడు తలకోన సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- ఉదయం మహా గణపతి పూజ
- సాయంత్రం ధ్వజారోహణం



తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయం

భాకరాపేట: జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒక్కటైన తలకోన పుణ్యక్షేత్రం ఎర్రావారిపాళెం మండలం శేషాచలం అటవీ ప్రాంతంలో ఉంది. ఈ పుణ్య క్షేత్రంలోని శిరోద్రోణం(జలపాతం) చాలా పవిత్రమైనది. ఈ తీర్థంలో స్నానమాచరించి తలకోనలో వెలసిన శ్రీసిద్ధేశ్వర స్వామి, శ్రీ సిద్ధేశ్వరి అమ్మవారిని దర్శించుకుని మొక్కితే ఎలాంటి కోరికలైనా నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రతి ఏటా మహా శివరాత్రి సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతూనే వస్తుంది. సంతానం లేని వారు శివరాత్రి పర్వదినాన శిరోద్రోణం నుంచి వచ్చే తీర్థంలో స్నానమాచరించి వర పడితే వారికి సంతానం కలుగుతుందని నమ్మకం. దీని కోసం చాలా సుదూర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున వచ్చి వర పడుతారు. శివరాత్రి రోజు జాగారంతోపాటు మహా దేవుడి ఊరేగింపు ఉంటుంది. భక్తులు తిలకించేందుకు ముందుగానే తలకోనకు చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకుంటారు. జాగారం ఉండే భక్తుల కోసం హరికథా కాలక్షేపం కార్యక్రమాలు ఉంటాయి.

సిద్ధపూజ ప్రత్యేకత

మహా శివరాత్రి ముగింపు రోజు జరిగే సిద్ధపూజ చాలా ప్రత్యేకతను సంతరించుకుంది. జంగమ దేవర్లు సిద్ధపూజకు ప్రత్యేకంగా ప్రసాదం తయారు చేస్తారు. ఈ ప్రసాదాన్ని సిద్ధులు చాలా పవిత్రంగా స్వామివారికి ఉపవాసం ఉండి, శిరోద్రోణ స్నానమాచరించి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సంతానం కొసం వర పడిన వారు సిద్ధులు పంపిణీ చేస్తున్న ప్రసాదాన్ని చాలా భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తారు. సిద్ధపూజకు వచ్చి కోరిన కోర్కెలు తీరలేదని చెప్పే భక్తులు ఉండరని చెబుతుంటారు.

తలకోనకు చేరుకోవాలంటే...

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో తలకోన పుణ్యక్షేత్రం ఉంది. మహా శివరాత్రి పర్వదినానికి తిరుపతి, శ్రీకాళహస్తి, రాజంపేట, కడప, రాయచోటి, పీలేరు, మదనపల్లె డిపోలు నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉంటాయి. అలాగే తిరుపతి-మదనపల్లె మార్గంలోని భాకరాపేట నుంచి 23 కిలోమీటర్ల దూరంలో తలకోన ఉంది. ఇక్కడ నుంచి ఆటోలు ఉంటాయి. ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులను నడపడమే కాకుండా భాకరాపేట, తలకోన ప్రాంతంలో ఆర్టీసీ అధికారులు ఉండి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వీసులను కొనసాగిస్తారు.

నేడు అంకరార్పణ

తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఉదయం మహా గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, అంకుర్పారణ, కలశస్థాపనం, రుద్రపారాయణం, సాయంత్రం 4 గంటలకు నందీశ్వరుడికి అభిషేకం, ధ్వజారోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పలుకుతారు.



శ్రీసిద్ధేశ్వర స్వామి



శ్రీసిద్ధేశ్వరి అమ్మవారు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



స్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తిరుపతి తుడా: తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్‌లో 1976 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కోరిక మేరకు ఒక బీరువా, పుట్ బాల్, వాలీ బాల్ వంటి క్రీడా సామగ్రిని స్కూల్ హెడ్ మాస్టర్ మునిశేఖర్‌కు అందజేశారు. అంతేకాక 100 మందికి పైగా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న విద్యార్థినీవిద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ ఏడాది10 వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను సంఘం తరపున పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు భార్గవ, విజయఫణిబాబు, మోహన్, సోము, రవి తదితరులు మాట్లాడుతూ 2014లో ఏర్పడిన తమ సంఘం 10వ వార్షికోత్సవాల్లో భాగంగా తాము చదువుకున్న పాఠశాలపై ప్రేమతో మూడోసారి చేతనైన సహాయం అందిస్తున్నామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని నడవలూరుకు చెందిన కుసుమకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.65,000 చెక్కును తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం అందజేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమెకు ఆర్థిక ఇబ్బందులు రావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేసినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, యశ్వంత్, సెంథిల్, హర్ష పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



ప్రత్యేక పూజలు చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప సర్పంచి వేణుగోపాల్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రామయ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బాలయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు శెట్టి, దిలీప్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఉమ మహేశ్వర్‌రావు, స్వయంప్రభ, జ్యోతి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్



విద్యుత్ సమస్యపై రైతు సమస్యను తెలుసుకుంటున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్ అధికారులు

చంద్రగిరి: విద్యుత్ శాఖలో ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించడం కోసమే ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యాక్రమాన్ని నిర్వహించినట్లు విద్యుత్ అదాలత్ చైర్ పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక సబ్ స్టేషన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి రైతులు, స్థానికులు పలు ఫిర్యాదులను అదాలత్ ముందుకు తీసుకొచ్చారు. ఇంటి వద్ద విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ భూములకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు, మరమ్మతులకు గురైన విద్యుత్ లైన్ల పునరుద్ధరణ తదితర సమస్యలను రాతపూర్వకంగా అందజేశారు. వాటిని పరిశీలించిన అధికారులు వెంటనే సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కార మార్గాన్ని చూపించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పలు సమస్యలను వినియోగదారులు, రైతులు కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోలేరని, వాటిని వారి మండల పరిధిలోనే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమస్యలను పరిష్కరించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీ కుమార్, ఈశ్వరమ్మ, ఈఈ వాసురెడ్డి, ఏడీఈ శేషాద్రిరెడ్డి, ఏఈలు నాగరాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీఓంకార జ్యోతిర్లింగస్వామి ఆలయ కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట మండలం వెదర్ల చెరువు గ్రామంలో వెలిసిన శ్రీఓంకార జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8, 9వ తేదీల్లో జరుగనున్న శివరాత్రి మహోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ స్వామి, గుండాల గోపినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం కపిలతీర్థం నంది సర్కిల్లో ఆలయ కమిటీ సభ్యులు శివరాత్రి మహోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8న శివరాత్రి నాడు ఉదయం 6 గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇదే రోజు రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం ఉంటుందన్నారు. 9న ఉదయం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి మహోత్సవాలకు భక్తులంతా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్ స్వామి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రభాకర్ నాయుడు, కేఎస్ రాజా, పొన్నాల జేజిరెడ్డి పాల్గొన్నారు.